క్లుప్తంగా

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

కన్నాయిగూడెం : విద్యుత్ మరమ్మతుల కారణంగా కన్నాయిగూడెంలోని అన్ని గ్రామాలకు నేడు విద్యుత్ సరఫరాను నిలిపివేస్తున్నట్లు ఏఈ స్వామి ఒక ప్రకటన తెలిపారు. ఏటూరు నాగారం నుంచి కన్నాయిగూడెం వరకు ఉన్న 33కేవీ విద్యుత్ లైన్ మరమ్మతులతో ఆదివారం ఉదయం 9నుంచి మధ్యాహ్నం 2గంటల వరకు విద్యుత్ నిలిపి వేస్తున్నట్లు పేర్కొన్నారు. రైతులు, వినియోగదారులు సహకరించాలని ఏఈ కోరారు.

ఏటూరునాగారం : మండలంలో నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని ఏఈ అశోక్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. నేడు(ఆదివారం) ఉదయం 9 నుంచి 1 గంట వరకు విద్యుత్ సరఫరా నిలిపి వేయనున్నట్లు పేర్కొన్నారు. మంగపేట మండలం కమలాపురంలోని 132 కేవీ సబ్‌స్టేషన్ బ్రేకర్ షిఫ్టింగ్ ఉన్నందున సరఫరా నిలిపి వేయడం జరుగుతుందన్నారు. గ్రామస్తులు, వినియోగదారులు సహకరించాలని కోరారు.

ఇన్‌చార్జ్ ఎంపీడీఓగా రహీం



ములుగు రూరల్ : మల్లంపల్లి ఇన్‌చార్జ్ ఎంపీడీఓగా ఎండీ రహీం శనివారం బాధ్యతలు స్వీకరించారు. ములుగు ఎంపీఓగా విధులు నిర్వర్తిస్తున్న రహీంను కలెక్టర్ టీఎస్ దివాకర మల్లంపల్లి మండల ఇన్‌చార్జ్ ఎంపీడీఓగా బాధ్యతలు అప్పగించారు. మల్లంపల్లి పంచాయతీ కార్యదర్శి రాజు, వైద్యసిబ్బంది ఎండీ రహీంకు పుష్పగుచ్ఛం అందించి శుభాకాంక్షలు తెలిపారు.

చంద్రుతండాలో వైద్యశిబిరం



గోవిందరావుపేట : మండలంలోని చంద్రుతండా గ్రామంలో శనివారం నిర్మాణ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో ఓపెన్ టెక్స్ సహకారంతో డాక్టర్ రాజేశ్ ఉచిత వైద్యశిబిరం ఏర్పాటు చేశారు. ఈ వైద్యశిబిరంలో చంద్రు తండా, కర్లపల్లి గ్రామాలకు చెందిన సుమారు 200 మందికి రక్తనమూనాలు సేకరించారు. కంటి చూపు, గర్భస్థ సమస్యలు ఉన్న వారికి స్క్రీనింగ్ టెస్టులు చేశారు. అనంతరం ఉచితంగా మందులు పంపిణీ చేశారు.

ఆర్థికసాయం



వాజేడు : మండల పరిధిలోని జంగాలపల్లి గ్రామానికి చెందిన వాసం నాగలక్ష్మి ఇటీవల రోడ్డు ప్రమాదంలో గాయపడి మృతిచెందింది. కాగా బాధిత కుటుంబానికి కాంగ్రెస్ పార్టీ మండల ఆధ్వర్యంలో శనివారం రూ.10వేలు ఆర్థిక సాయం అందజేశారు. పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి విక్రాంత్, సీనియర్ నాయకుడు విశ్వనాథ ప్రసాదరాజు, ఆదినారాయణ, జగన్నాథ రాజు, ఖాజావలి, దాట్ల వాసు, సంజీవ, స్వామి మృతురాలి భర్త నీలాద్రిని పరామర్శించారు. అలాగే తన వంతు సాయం అందిస్తానని భద్రాచలం ఎమ్మెల్యే తెల్లం వెంకట్రావు తెలిపినట్లు వారు పేర్కొన్నారు.

ఆర్థికాభివృద్ధి సాధించాలి

రేగొండ: గ్రామీణ మహిళలు ఆర్థికంగా అభివృద్ధి చెందాలని ప్రజ్వల్ కో ఆర్డినేటర్ శ్రీనివాస్ అన్నారు. శనివారం మండలంలోని తిరుమలగిరి గ్రామంలో ఎఫ్‌పీసీఎల్ సహకారంతో ఎస్‌హెచ్‌జీ మహిళా సంఘానికి బయో ఇన్పూట్ సెంటర్‌ను మంజూరు చేయగా ప్రారంభించి మాట్లాడారు. మండలంలోని రైతులకు బయోఎరువులు అందుబాటులో ఉండేలా సెంటర్‌ను ప్రారంభించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రజ్వల్ మేనేజర్ శ్రీనివాస్, రమాదేవి, తిరుపతి, పాషా, సాయికిరణ్ తదితరులు పాల్గొన్నారు.

నోట్‌బుక్స్ పంపిణీ


మొగుళ్లపల్లి: మండలంలోని గుడిపహాడ్ గ్రామానికి చెందిన గంగదారి లావణ్య–రాజు దంపతుల కుమార్తె వీక్షిత జయంతి సందర్భంగా ఆమె జ్ఞాపకార్థం బంగ్లాపల్లి పాఠశాల విద్యార్థులకు శనివారం నోట్‌బుక్స్, వాటర్ బాటిళ్లు, పలకలు, స్వీట్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయుడు కృష్ణారెడ్డి, ఓరుగంటి రవీందర్, శిరీష,యూసబ్‌బీ, గ్రామస్తులు రజిత, పర్వతాలు, కరాబు రజిత, యువరాజు,రఫీ బుర్ర సమ్మయ్య, రాజిరెడ్డి, చంద్రకాంత్ పాల్గొన్నారు.

మండల కమిటీ ఎన్నిక

టేకుమట్ల: తెలంగాణ రైతు సంఘం మండల కమి టీని మండలంలోని అంకుషాపూర్‌లో శనివారం ఎన్నుకున్నట్లు జిల్లా అధ్యక్షుడు చింతల రజినీకాంత్ తెలిపారు. అధ్యక్షుడిగా ఎడుత రాయకొముురు, ప్ర ధాన కార్యదర్శిగా పోతనవేని కుమార్‌లను ఎన్నుకున్నట్లు వెల్లడించారు.

పారిశుద్ధ్యం అస్తవ్యస్తం

అధ్వానంగా మురికి కాల్వలు
- పేరుకుపోతున్న చెత్తాచెదారం
- దోమలతో ఇబ్బందిపడుతున్న స్థానికులు



మానసపల్లిలో అధ్వానంగా మురికి కాల్వ



ఆరోవార్డులో చెత్తాచెదారం పేరుకుపోయి మురుగు నీరు నిలిచిన కాల్వ

ఏటూరునాగారం : గ్రామాల అభివృద్ధిపై అధికారులు నిర్లక్ష్యం వహిస్తున్నారు..పట్టించుకొని వారు లేకపోవడంతో చెత్తాచెదారం పేరుకుపోయి పారిశుద్ధ్యం అస్తవ్యస్తంగా తయారైంది. మండల కేంద్రంలోని మురుగునీరు బయటికి పోకపోవడంతో డ్రెయినేజీలు అధ్వానంగా మారాయి. మురుగు కాల్వల్లో చెత్తాచెదారం పేరుకుపోయి దుర్వాసన వెదజల్లుతోంది. ఈగలు, దోమలకు ఆవాసంగా మారి, దోమకాటుకు ప్రజలు రోగాల బారిన పడుతున్నారు. కాల్వల్లో దోమల నివారణకు బ్లీచింగ్ పౌడర్ వేసేందుకు సైతం గ్రామ పంచాయతీ నుంచి బిల్లులు ఇవ్వడం లేదని కాంట్రాక్టర్ పౌడర్ చల్లడం నిలిపి వేసినట్లు తెలిసింది. అంతేకాకుండా మురుగు కాల్వల్లో చెత్తాచెదారం వల్ల విషపురుగులు తయారై ప్రజలు భయపడుతున్నారు. డ్రెయినేజీలు ఉన్న ప్రాంతాల్లో దోమల వ్యాప్తి అధికంగా ఉన్నట్లు స్థానికులు వాపోతున్నారు. ఇళ్ల నుంచి వచ్చే వ్యర్థాలు సైతం కాల్వల్లో నిల్వ ఉండడం వల్ల నీరు నిలిచి దుర్గంధం వస్తోందని ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

ఎక్కడి చెత్త అక్కడే..

గ్రామంలోని పలు విధుల్లోని మురుగు కాల్వల్లో ప్రజలు చెత్తాచెదారం పడేయడంతో మురుగు నీరు నిలుస్తోంది. దీంతో ఎక్కడికక్కడ చెత్త నిలిచి నీటిని ముందుకు వెళ్లనివ్వకుండా అడ్డుకుంటుంది. గ్రామ పంచాయతీ అధికారులు కాల్వల్లో మట్టి తొలగింపుపై శ్రద్ధ చూపడం లేదని పలువురు వాపోతున్నారు. వెంటనే చెత్తాచెదారం తొలగించి మురుగు నీరు సజావుగా వెళ్లేలా చూడాలని స్థానికులు, కాలనీవాసులు కోరుతున్నారు.

కాల్వల్లో మట్టిని తొలగిస్తాం..



కాల్వల్లో పేరుకుపోయిన మట్టి, చెత్తాచెదారాన్ని తొలగిస్తాం. ప్రజల సమస్యలపై ప్రత్యేక దృష్టిపెడుతాం. కాల్వల్లో ఎక్కడెక్కడ చెత్తాచెదారం పేరుకుపోయిందని పరిశీలించి వాటి తొలగింపునకు చర్యలు తీసుకుంటాం.

– రమాదేవి, కార్యదర్శి, ఏటూరునాగారం

చెత్తను తొలగించాలి



ఆరో వార్డులో చెత్తాచెదారం పేరుకుపోయింది. కాల్వల్లో మురుగు నీరు నిలిచి ఎటు వెళ్లడం లేదు. దీంతో దుర్వాసన వస్తుంది. కాల్వల్లో చెత్తతోపాటు వ్యర్థాలు సైతం నిల్వ ఉండడం వల్ల ముక్కుపూటాలు అదిరిపోయేలా దుర్వాసన రావడంతో ఇంట్లో ఉండలేకపోతున్నాం.

– సునార్కని భిక్షపతి, ఆరో వార్డు

దోమల మందు పిచికారీ చేయాలి



మురుగు కాల్వల్లో పెరిగిన దోమలను నివారించాలి. దోమల వల్ల జ్వరాలు వస్తున్నాయి. మురుగు కాలవ్వల్లో నుంచి విషకీటకాలు రావడం వల్ల చిన్నారులు, తల్లిదండ్రుల భయాందోళనకు గురవుతున్నారు. వెంటనే దోమల మందు పిచికారీ చేయించాలి.

– కొండాయి చిన్ని, ఐదో వార్డు

సోనియాగాంధీ క్షమాపణ చెప్పాలి



సమావేశంలో మాట్లాడుతున్న సురేందర్

- బీజేపీ ఎస్టీ మోర్చా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కొత్త సురేందర్

ఏటూరునాగారం : రాష్ట్రపతి ద్రౌపది ముర్ముకు కాంగ్రెస్ అధినేత్రి సోనియాగాంధీ బహిరంగా క్షమాపణ చెప్పాలని బీజేపీ ఎస్టీ మోర్చా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కొత్త సురేందర్ అన్నారు. శనివారం మండల కేంద్రంలోని బీజేపీ కార్యాలయంలో నిర్వహించిన ఆ పార్టీ నాయకుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రస్తుతం జరుగుతున్న పార్లమెంట్ సమావేశంలో ఏఐసీసీ అధ్యక్షురాలు సోనియాగాంధీ గిరిజన మహిళ, ద్రౌపది ముర్ముపై అనుచిత వ్యాఖ్యలు చేయడం సరికాదన్నారు. గిరిజన ఆదివాసీలకు బీజేపీ చేస్తున్న అభివృద్ధిని ఓర్చుకోలేక వక్రీకరించి మాట్లాడడం బాధాకరమని పేర్కొన్నారు. వెంటనే సోనియాగాంధీ దేశంలోని ఆదివాసీ గిరిజన మహిళలు, దళితులకు క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు వినుకోలు చక్రవర్తి, గండెపల్లి సత్యం, జనార్దన్, కిశోర్, ఈక మహాలక్ష్మి, గంగా, రాజశేఖర్, ఎల్లయ్య సంపత్, రవి, తదితరులు పాల్గొన్నారు.

కార్పెంటర్లను ఆదుకోవాలి



మాట్లాడుతున్న నర్సింహాచారి

వెంకటాపురం(కె) : వడ్రంగి వృత్తిదారులను (కార్పెంటర్లు) ప్రభుత్వం ఆదుకోవాలని కార్పెంటర్ల సంఘం జిల్లా నాయకుడు కట్ల నర్సింహాచారి కోరారు. శనివారం మండల కేంద్రంలోని ఆర్‌అండ్‌బి అతిథి గృహం వద్ద ఆ సంఘం ముఖ్య కార్యకర్తల సమావేశాన్ని నిర్వహించి మాట్లాడారు. పనులు లేక తాము ఇబ్బందులు పడుతున్నామని ప్రభుత్వం బ్యాంకుల ద్వారా రాయితీపై రుణాలు మంజూరు చేయడంతో పాటు ప్రతీ కుటుంబానికి ఇందిరమ్మ ఇళ్లు ఇవ్వాలన్నారు. అటవీ శాఖ నుంచి కార్పెంటర్లకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూడాలని మండలంలో టింబర్ డిపో ఏర్పాటు చేసి పనులు కల్పించాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో రామాచారి, శ్రీను, శివ, నాగాచారి తదితరులు ఉన్నారు.

శరవేగంగా 'భగీరథ' పనులు



వాజేడు : మండల పరిధిలోని జగన్నాథపురం గ్రామం నుంచి మిషన్ భగీరథ పైపులైన్ పనులను శనివారం ప్రారంభించారు. జగన్నాథపురం నుంచి చెరుకూరు వరకు రోడ్డు విస్తరణ పనులు కొనసాగుతుండగా చాలా చోట్ల మిషన్ భగీరథ పైపులైన్లు ధ్వంసమవుతున్నాయి. దీంతో మండలంలో పలు గ్రామాలకు తాగునీరు అందక ఇబ్బందులు పడుతున్నారు. దీంతో ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు పైపులైన్లను రహదారికి దూరంగా మారుస్తున్నారు. ప్రజలకు తాగునీరు అందించేందుకు పొక్లెయినర్‌తో శరవేగంగా పనులు చేస్తున్నారు.

విద్యార్థులకు చట్టాలపై అవగాహన



అవగాహన కల్పిస్తున్న మహేందర్

వెంకటాపురం(ఎం) : మండలంలోని నర్సాపూర్ జెడ్పీ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు చట్టాలపై అవగాహన కల్పించినట్లు చీఫ్ లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ మేకల మహేందర్ తెలిపారు. చైల్డ్ ఫ్రెండ్లీ లీగల్ సర్వీసెస్ ఫర్ చిల్డ్రన్స్ స్కీంలో భాగంగా పాఠశాలలో శనివారం న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించగా మహేందర్ హాజరై మాట్లాడారు. మోటార్ వెహికల్ చట్టం, విద్యాహక్కు చట్టం, బాల్య వివాహాల నిరోధక చట్టం, బాలకార్మికుల చట్టం, ఉచిత న్యాయం ఎలా పొందాలో వారు విద్యార్థులకు వివరించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ చీఫ్ లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ బానోత్ స్వామిదాస్, అసిస్టెంట్ లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ రాచర్ల రాజ్‌కుమార్, హెచ్‌ఎం మంజుల, ఉపాధ్యాయులు మధుసూదన్, సాంబయ్య తదితరులు పాల్గొన్నారు.

సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కుల పంపిణీ



చెక్కు పంపిణీ చేస్తున్న నాయకులు

వెంకటాపురం(కె) : మండల పరిధిలోని పలువురు లబ్ధిదారులకు సీఎం సహాయ నిధి చెక్కులను కాంగ్రెస్ పార్టీ నాయకులు శనివారం పంపిణీ చేశారు. అంకన్నగూడెం గ్రామానికి చెందిన తాటి జయమ్మకు మంజూరైన రూ.45,000, నూగూరు కాలనీ గ్రామానికి చెందిన శ్యామల ప్రవీణ్‌కు మంజూరైన రూ.19,000 విలువైన చెక్కులను లబ్ధిదారులకు అందజేశారు. పార్టీ మండల అధ్యక్షుడు సయ్యద్ హుస్సైన్, మాజీ జెడ్పీటీసీ పాయం రమణ, బాలసాని వేణు, సాయికృష్ణ, వెంకటేశ్వర్లు, నాగేశ్వరరావు, కిరణ్, కృష్ణమూర్తితో పాటు తదితరులు ఉన్నారు.

'అందుబాటులో ఉండని పీఓ'

కాళేశ్వరం: టీజీఎండీసీ ప్రాజెక్టు మేనేజర్ శ్రీరాములు అందుబటులో ఉండడం లేదని, కనీసం సమాచారం ఇవ్వడం లేదని ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షుడు బెల్లంపల్లి సురేశ్ ఆరోపించారు. శనివారం ఎమ్మార్పీఎస్ నాయకులు కాళేశ్వరంలోని పీఓ కార్యాలయానికి వచ్చి ఆయన లేకపోవడంతో డోర్‌కు వినతిపత్రం అంటించారు. ఈ సందర్భంగా సురేశ్ మాట్లాడుతూ.. ఇసుక అక్రమ తరలింపునకు పీఓ సహకరిస్తున్నారని అన్నారు. ఉన్నతాధికారులు స్పందించి ఆయనను విధుల నుంచి తొలగించాలని పేర్కొన్నారు. నాయకులు ధర్మయ్య, నాగరాజు, రవితేజ, మధు, గణపతి, తదితరులు పాల్గొన్నారు.

మధ్యాహ్న భోజనం ఏర్పాటు అభినందనీయం

- ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు



భోజనం వడ్డిస్తున్న ఎమ్మెల్యే గండ్ర, నాయకులు

భూపాలపల్లిరూరల్: విద్యార్థులకు జిల్లా రైస్ మిల్లర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో మధ్యాహ్న భోజనం ఏర్పాటు చేయడం అభినందనీయమని ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు అన్నారు. శనివారం జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో విద్యార్థులకు జిల్లా రైస్ మిల్లర్ల అసోసియేషన్ ఆధ్వర్యంలో ఉచిత మధ్యాహ్న భోజనం ఏర్పాటు చేయగా ట్రేడ్ కార్పొరేషన్ చైర్మన్ ఐత ప్రకాశ్‌రెడ్డితో కలిసి ఎమ్మె ల్యే గండ్ర సత్యనారాయణరావు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. వచ్చే విద్యా సంవత్సరం నుంచి ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో మధ్యాహ్న భోజన పథకం అమలు చేసేందుకు ప్రభుత్వం సన్నాహాలు చేస్తుందని తెలిపారు. జిల్లా రైస్ మిల్లర్ల అసోసియేషన్ అధ్యక్షుడు పెరుమాండ్ల తిరుపతిగౌడ్‌ను ఎమ్మెల్యే శాలువా కప్పి అభినందించారు. అనంతరం విద్యార్థులకు ఎమ్మెల్యే మధ్యాహ్న భోజనాన్ని వడ్డించి, అక్కడే విద్యార్థులతో కలిసి భోజనం చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ కౌన్సిలర్లు దాట్ల శ్రీనివాస్, కాంగ్రెస్ నాయకులు కొమురయ్య, పిప్పాల రాజేందర్, అప్పం కిషన్, మిల్లర్స్ అసోసియేషన్ నాయకులు, మిల్లర్లు పాల్గొన్నారు.

తారురోడ్డుకు మరమ్మతులు

సాక్షి ఎఫెక్ట్..



ఏటూరునాగారం : మండలంలోని చిన్న బోయినపల్లి నుంచి ఎస్‌ఎస్‌తాడ్వాయి వరకు ఉన్న 163 జాతీయ రహదారిపై గుంతలు పడడంతో మరమ్మతులు చేపట్టారు. అయితే నిర్మాణ పనులను తూతూ మంత్రగా చేపట్టడంతో 'నాసిరకంగా మరమ్మతులు' అనే కథనంతో సాక్షిలో గత నెల 28వ తేదీన ప్రచురితమైంది. దీంతో స్పందించిన నేషనల్ హైవే ఇంజనీరింగ్ అధికారులు శనివారం రోడ్డుపై ఊడిన పెచ్చులను తొలగించారు. రోడ్డుకు చిప్పింగ్ చేసి మరమ్మతు పనులు చేపట్టారు. తారురోడ్డును నాణ్యతగా వేయాలని అధికారులు సంబంధిత కాంట్రాక్టర్‌కు ఆదేశించారు.

ఉత్తమ ఫలితాలు సాధించాలి

- ఎంఈఓ మల్లయ్య



విద్యార్థులకు స్నాక్స్ అందజేస్తున్న ఎంఈఓ మల్లయ్య

ఏటూరునాగారం : ప్రభుత్వ పాఠశాలలో పదోతరగతి చదువుతున్న విద్యార్థులకు ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్నట్లు ఎంఈఓ కొయ్యడ మల్లయ్య శనివారం తెలిపారు. విద్యార్థులకు ఉదయం 8 నుంచి 9గంటల వరకు సాయంత్రం 4:15 నుంచి 5:15 నిమిషాల వరకు ప్రత్యేక తరగతులు ఉంటాయని, విరామంలో విద్యార్థులకు స్నాక్స్ పంపిణీ చేయాలని ప్రభుత్వం ఆదేశించిందని పేర్కొన్నారు. దీంతో మండల కేంద్రంలోని జెడ్పీఎస్ఎస్‌లో ఎంఈఓ స్నాక్స్ పంపిణీ కార్యక్రమాన్ని ప్రారంభించారు. విద్యార్థులు పరీక్షల్లో ఉత్తమ ఫలితాలు సాధించేందుకు ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకున్నట్లు వెల్లడించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు సాంబశివరావు, ఉపాధ్యాయులు సమ్మయ్య, ప్రవళిక, శోభ, రాములు, శశిధర్ పాల్గొన్నారు.

సాంకేతిక పరిజ్ఞానాన్ని పెంపొందించుకోవాలి

విద్యార్థులు శాస్త్ర, సాంకేతిక పరిజ్ఞానాన్ని పెంపొందించుకోవాలని ఎంఈఓ కొయ్యడ మల్లయ్య సూచించారు. శనివారం మండల కేంద్రంలోని నార్త్ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో డిజిటల్ ప్రొజెక్టర్‌ను ఆయన ప్రారంభించారు. అనంతరం ఎంఈఓ మల్లయ్య మాట్లాడుతూ విద్యార్థులకు ఉపాధ్యాయులు గుణాత్మక విద్యను అందించాలన్నారు. డిజిటల్ ఉపకరణాల ద్వారా బోధనను మరింత మెరుగ్గా చేయవచ్చని, విద్యార్థులు కూడా ఆయా విషయాలను చాలా ఉత్సాహంగా నేర్చుకుంటారని తెలిపారు. ఎంఈఓ, కాంప్లెక్స్ హెచ్‌ఎం సాంబశివరావు పాఠశాలకు ప్రొజెక్టర్‌ను బహూకరించిన న్యాయవాది మేకల గౌతం కుమార్‌ను అభినందించారు. సమాజంలో ఉన్నత స్థానంలో ఉన్నవారు ప్రభుత్వ పాఠశాలలకు తమకు తోచినంత సాయం చేసి అభివృద్ధికి దోహదపడాలని కోరారు. నార్త్ పాఠశాల అభివృద్ధి కోసం ఉపాధ్యాయులు చేస్తున్న కృషిని కొనియాడారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు పోతు రాజశేఖర్, ఉపాధ్యాయులు సారంగపాణి, రాంబాబు, వరలక్ష్మి పాల్గొన్నారు.

నాణ్యమైన భోజనం అందించాలి



విద్యార్థులతో కలిసి భోజనం చేస్తున్న తహసీల్దార్

వెంకటాపురం(ఎం) : విద్యార్థులకు నాణ్యతతో కూడిన భోజనాన్ని అందించాలని తహసీల్దార్ గిరిబాబు ఉపాధ్యాయులకు సూచించారు. శనివారం మండలంలోని చెంచుకాలనీ గిరిజన ఆశ్రమ బాలికల పాఠశాలను ఆయన సందర్శించారు. పాఠశాలలోని హాజరు పట్టిక, తదితర రికార్డులను తనిఖీ చేసి, మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించి విద్యార్థులతో కలిసి భోజనం చేశారు. పాఠశాలలో ఏమైనా సమస్యలు ఉన్నాయా అని విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. ఉపాధ్యాయులు సమయపాలన పాటించాలని ఆయన సూచించారు.

కుష్ఠు వ్యాధిని నిర్మూలిద్దాం

- డీపీఎంఓ సంజీవరావు



అవగాహన కల్పిస్తున్న వైద్యబృందం

తాడ్వాయి : కుష్ఠు వ్యాధి నిర్మూలనకు ఐక్యంగా కృషి చేద్దామని డీపీఎంఓ సంజీవరావు పేర్కొన్నారు. జాతీయ కుష్ఠు వ్యాధి నిర్మూలన దినోత్సవం సందర్భంగా శనివారం మండలంలోని మేడారం ఇంగ్లిష్ మీడియం, ఊరట్టంలోని గిరిజన ఆశ్రమ పాఠశాలలో విద్యార్థినులకు కుష్ఠు వ్యాధి నివారణపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఎవరికైనా చర్మంపై స్పర్శ లేని మచ్చలు ఉంటే వాటిని తాకినప్పుడు నొప్పి కలగకపోతే అది కుష్ఠు వ్యాధిగా నిర్ధారించాలి అని వివరించారు. కుష్ఠు వ్యాధి వ్యాపించకుండా ముందస్తుగా స్థానిక ప్రభుత్వ ఆస్పత్రిలో చికిత్స చేయించుకోవాలని సూచించారు. కుష్ఠు వ్యాధిగ్రస్తులపై ఎలాంటి వివక్ష చూపించరాదని, ఆత్మగౌరవాన్ని భంగం కలిగించకుండా వారితో సామరస్యంగా ప్రవర్తించాలని అన్నారు. కుష్ఠు వ్యాధి పూర్తిగా నయం చేయదగినది అని తెలిపారు. అనంతరం కుష్ఠు నిర్మూలనకు ప్రతి ఒక్కరూ కృషి చేద్దామని విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో తాడ్వాయి వైద్యాధికారి చిరంజీవి, ప్రధానోపాధ్యాయుడు కల్తీ శ్రీనివాసులు, హెచ్‌ఈఓ సమ్మయ్య, సూపర్‌వైజర్ సరస్వతి, సిబ్బంది పాల్గొన్నారు.

అగ్ని ప్రమాద బాధితులకు చేయూత



బాధిత కుటుంబానికి సాయం అందజేస్తున్న కాంగ్రెస్ నాయకులు

ఎస్‌ఎస్‌తాడ్వాయి : అగ్ని ప్రమాద బాధిత కుటుంబానికి కాంగ్రెస్ పార్టీ అండగా ఉంటుందని ఆ పార్టీ కిసాన్ సెల్ మండల అధ్యక్షుడు బూషనబోయిన రవికుమార్ అన్నారు. శనివారం మండలంలోని గోనెపల్లి గ్రామంలో ఇటీవల అగ్ని ప్రమాదంలో ఇల్లు దగ్ధమైన రొక్కని ముత్తయ్య కుటుంబానికి కాంగ్రెస్ పార్టీ నాయకులు చేయూతనిచ్చారు. పార్టీ మండల అధ్యక్షుడు బొల్లి దేవేందర్ ఆధ్వర్యంలో బాధిత కుటుంబాన్ని పరామర్శించి రూ.4 వేల నగదుతో పాటు 50 కేజీల బియ్యం, దుప్పట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మంత్రి సీతక్క ఆదేశాల మేరకు కుటుంబానికి ఆర్థిక సాయం అందజేశామని, వారి కుటుంబానికి కాంగ్రెస్ పార్టీ ఆదుకుంటుందని అన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ చింత ఎర్రయ్య, నాయకుడు రామానాథం, కంకనాల రవీందర్ రెడ్డి, సాంబయ్య, గడ్డం నాగభూషన్, జయేందర్, కృష్ణ, శివరాజు, సురేష్ నాయకులు పాల్గొన్నారు.

తాగునీటి సమస్య తలెత్తకుండా చర్యలు

- ఎంపీఓ వీరస్వామి



పైపులైన్‌ను పరిశీలిస్తున్న అధికారులు

కాటారం: వేసవికాలంలో గ్రామాల్లో తాగునీటి సమస్య తలెత్తకుండా ముందస్తు నివారణ చర్యలు చేపడుతున్నట్లు ఎంపీఓ వీరస్వామి, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈఈ రాజశేఖర్ తెలిపారు. తాగునీటి సరఫరా స్పెషల్ డ్రైవ్‌లో భాగంగా అధికారులు శనివారం మండలంలోని మేడిపల్లి, బయ్యారం, మద్దులపల్లితో పాటు పలు గ్రామాల్లో పర్యటించి తాగునీటి సరఫరా పథకాలను పరిశీలించారు. మిషన్ భగీరథ నీటి సరఫరా, చేతి పంపులు, ఇతరాత్ర తాగునీటి పథకాల పనితీరుపై ఆరా తీశారు. గ్రామాల్లోని జనాభాకు సరిపడా నీరు అందుతుందా లేదా అని అంచనా వేశారు. పైపులైన్ లీకేజీలు లేకుండా చూసుకోవాలని గ్రామ పంచాయతీ, మిషన్ భగీరథ సిబ్బందిని ఆదేశించారు. ఆయా గ్రామాల పంచాయతీ కార్యదర్శులు, సిబ్బందితో పాటు తదితరులు ఉన్నారు.

పరామర్శ

చిట్యాల: మండల కేంద్రంలోని క్రోసూరుపల్లి గ్రామానికి చెందిన మునీర్ అనారోగ్యంతో శనివారం మృతి చెందాడు. దీంతో బాధిత కుటుంబాన్ని బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు అల్లం రవీందర్ పరామర్శించి ఆర్థిక సాయం అందజేశారు. మునీర్ మృతదేహం వద్ద నివాళులర్పించారు. అనంతరం ఆయన వెంట బీఆర్‌ఎస్ మండల నాయకులు పాండ్రాల స్వామి, తోటం నవీన్, పిట్ట సురేష్, ఆరేపల్లి సమ్మయ్య, పెరుమాండ్ల రవీందర్ గౌడ్, తాటిపల్లి శ్రీనివాస్, ఏలేటి రాజు తదితరులు ఉన్నారు.